క్లుప్తంగా

ఎన్‌సీసీతో ఐకమత్యం, క్రమశిక్షణ, దేశభక్తి

తెనాలి రూరల్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ క్యాడెట్ల రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. విద్యార్థుల్ని ఉద్దేశించి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఉమాశంకర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ఐకమత్యం, క్రమశిక్షణ, దేశభక్తి నేర్పిస్తుందని చెప్పారు. తమ విద్యార్థి జయేంద్ర కుమార్ ఈ ఏడాది ఎన్‌సీసీ ద్వారానే మెడిసిన్‌లో సీట్ సంపాదించడం కళాశాలకి గర్వకారణం అని కరస్పాండెంట్ మేరీ గ్రేస్ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ ప్రియదర్శిని, ప్రిన్సిపాల్ డాక్టర్ జంగం సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్ సామ్యా నాయక్, కళాశాల సిబ్బంది, ఎన్‌సీసీ స్టాఫ్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి అర్బన్: దాసరి నాయుడమ్మ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, సినీ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. ముందుగా నాయుడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, ఉప కార్యదర్శి షేక్ మీరావలి, సభ్యులు షేక్ కాలేషా, ఎస్ఆర్‌టీ శ్రీను, కె.రవిశంకర్, కోటి, మునిపల్లి వంశీ పాల్గొన్నారు.

బైక్ అపహరణ

తెనాలి రూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. పట్టణ సాలిపేటకు చెందిన గుంటూరు సురేష్‌బాబు శుక్రవారం రాత్రి బైక్‌ను ఇంటి ముందు నిలిపాడు. శనివారం ఉదయం నిద్రలేచి చూడగా కనబడలేదు. ఆయన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యపై భర్త దాడి

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి భార్యను రోడ్డుపై కొట్టి పెట్రోలు పోసేందుకు ప్రయత్నించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మారుతీనగర్ 5వ లైనులో నివసించే షేక్ బాజి రింగ్ రోడ్డు లోని ఓ స్వీట్ షాపులో పని చేస్తుంది. ఆమె భర్త సురేష్ మద్యం తాగి తరచూ అక్కడకు వెళ్లి గొడవపడుతుండేవాడు. దీంతో షాపు యజమాని బాజీని ఉద్యోగం నుంచి తీసి వేశాడు. ఆమె శనివారం ఎస్వీఎన్ కాలనీలోని ఓ స్వీట్ షాపులో ఉద్యోగం కోసం వెళుతుండగా భర్త సురేష్ అడ్డగించి రోడ్డుపైనే కొట్టాడు. అనంతరం ఆమె మారుతీనగర్‌కు చేరుకోగా అడ్డగించి పెట్రోలు పోసేందుకు ప్రయత్నించాడు. బాజీ పరుగెత్తుకుంటూ తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మతిస్థిమితం లేని వ్యక్తి విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. దొప్పలపూడి సురేష్ (32) మతిస్థిమితం లేక కాగితాలు ఏరుకుంటూ తిరుగుతుంటాడు. బ్రాడీపేటలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుక్రవారం తీగలు పట్టుకుని విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గైనకాలజీ వార్డులో సిటీజీ మిషన్ ఏర్పాటు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ గైనకాలజీ వార్డులో సీటీజీ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. గైనికాలజీ వార్డులో ఇలాంటి మిషన్లు పది వరకు అవసరమని, ప్రస్తుతం ఒకటి మాత్రమే అందుబాటులో ఉందని చెప్పారు. ఉన్న ఒకే ఒక మిషన్ ద్వారా కూడా అరకొరగా సేవలు అందుతున్నాయని, ప్రింట్ కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ నిధుల నుంచి మిషన్‌ను కొనుగోలు చేస్తున్నామని, ఆదివారం తీసుకుని వచ్చి డెమో ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా మరిన్ని మిషన్లను కొనుగోలు చేస్తామని తెలిపారు.

మెడికల్ హాస్టల్‌లో పచ్చదనం పెంపునకు కృషి

గుంటూరు మెడికల్: హాస్టల్‌లో పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి తెలిపారు. అమరావతి రోడ్డులోని గుంటూరు వైద్య కళాశాల మెన్స్ హాస్టల్‌లో శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ టి.టి.కె.రెడ్డి మాట్లాడుతూ భూగోళం నానాటికి వేడెక్కిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల ద్వారా ఆక్సిజన్‌తో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందరికీ లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా వైద్య విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండి మొక్కలు నాటి, పచ్చదనం పెంపు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, బోధన సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజారోగ్యానికి భద్రత



దావులూరు శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



తెనాలి శిబిరంలో బీపీ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే శివకుమార్

దావులూరు (కొల్లిపర): జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి భద్రత కల్పించారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దావులూరు సచివాలయంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రోగులతో స్వయంగా మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకొని ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి కుటుంబాన్నీ ఆరోగ్యంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి, అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వారికి పూర్తిస్థాయిలో చికిత్సతో పాటు నాణ్యమైన మందులు ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఇటువంటి కార్యక్రమాన్ని గ్రామంలో ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి బోసుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసుధ , డాక్టర్ ప్రియాంక , పార్టీ నాయకులు మధు, మర్రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎన్ఎంహెచ్ స్కూలులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురు స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇచ్చారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శివకుమార్ పరిశీలించి అక్కడ అందుతున్న వైద్యంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో నిధుల్ని వెచ్చించి వైద్య శిబిరాల్ని నిర్వహిస్తోందని, ప్రజలందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కమిషనర్ ఎం.జశ్వంతరావు మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఇప్పటికే 345మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఇందులో జనరల్ ఓపీ 159, సర్జరీ ఓపీ 64, ఫిజిషియన్ ఓపీ 156, ఆప్తామాలజీ ఓపీ 175 ఉన్నాయని వివరించారు. శిబిరంలో 500 మందికి వైద్యసేవలు అందించే వెసులుబాటును కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు తోక శిరీష, యాతాటి అనిల్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు శానంపూడి రఘురామిరెడ్డి, గుంటూరు కృష్ణ, కుక్కల ముక్తేశ్వరరావు, అక్కిదాసు కిరణ్‌కుమార్, తాడిబోయిన రమేష్, స్పెషల్ ఆఫీసర్ గాయత్రీదేవి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం ,అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంచర్లపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన

తెనాలి టౌన్: రూరల్ మండలం కంచర్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు.శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు.శిబిరానికి విశేష స్పందన లభించింది.కొలకలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్.వి. సుబ్బారావు పర్యవేక్షణలో వైద్యులు మౌనిక,అఫీపా,మన్మథకుమార్ రోగులకు వైద్యపరీక్షలు జరిపారు.వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కోపల్లె మణెమ్మ ప్రారంభించారు.రోగులకు ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు.ఉచితంగా మందులు పంపిణీ చేశారు.సుమారు 450 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు డాక్టర్ సుబ్బారావు తెలిపారు.మందులను సర్పంచ్ మణెమ్మ,డాక్టర్‌లు అందజేశారు.జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ధర్మరాజుల చెన్నకేశవులు,తహసీల్దార్ కె.రవిబాబు,వైస్సార్‌సీపీ నాయకులు కోపల్లె సురేష్,పాదిలి శ్రీనివాసరావు,బొల్లినేని బుజ్జి,కఠెవరపు దేవయ్య,శివయ్య,వాకా శ్రీనివాసరావు,విఆర్వో రాంబాబు,పంచాయతీ కార్యదర్శులు వినయ్‌బాబు, శ్రీనివాసరావు,ఆరోగ్య సిబ్బంది,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డి సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు.ఆయన వెంట ఎంపీడీవో విజయాలక్ష్మణ్, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు,హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.



తెనాలిలో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు



తెనాలి శిబిరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్



కంచర్లపాలెంలో రోగికి మందులు అందజేస్తున్న సర్పంచ్ మణిమ్మ,డాక్టర్ సుబ్బారావు

సచివాలయ, వలంటీర్ వ్యవస్థ చారిత్రాత్మకం

ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి



అంగలకుదురు సచివాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

తెనాలి టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ చారిత్రాత్మక నిర్ణయంగా ప్రజలు పేర్కొంటున్నారని పంచాయతీరాజ్, రూరల్ డెవలెప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు టి.నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండల గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. అంగలకుదురులో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. అనంతరం సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి రాష్ట్రంలో 1.40లక్షల ఉద్యోగాలు కల్పించారని, ఎందరో యువతీ, యువకులకు ఉపాధి లభించినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలంటే అంతా కలసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురాకుండా ఉద్యోగులు, వలంటీర్లు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాదరావు, ఎంఈవో జయంత్‌బాబు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండి హేమారావు, జాస్తి శ్రీనివాసరావు, మొవ్వా ఆనంద్, తోట శ్రీకాంత్, మేరా సాహెబ్, బాదుల్లా, చుండూరు గోపి, కిరణ్ చంద్ పాల్గొన్నారు.

■ గుడివాడలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం వెల్‌నెస్ సెంటర్‌లను నాగార్జునరెడ్డి పరిశీలించారు. కేంద్రాల్లో పని చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, సచివాలయ, వ్యవసాయ సిబ్బందిని ప్రభుత్వ పథకాలు అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు. జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కంచర్లపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. అనంతరం బుర్రిపాలెంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనుల్ని నాగార్జునరెడ్డి పరిశీలించారు.

■ కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో నాగార్జునరెడ్డి మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకోసం వలంటీర్లు బాధ్యతతో పని చేయాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సుభాష్‌చంద్రబోస్, పంచాయతీ కార్యదర్శులు గుర్రం ప్రసాదరావు, కె.రామసుబ్బారావు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనపై ఢిల్లీ వైద్యబృందం సూచనలు



మాట్లాడుతున్న డాక్టర్ సునీత పలివాల్

తెనాలిఅర్బన్: కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ముస్కాన్ ఎసెస్‌మెంట్ టీమ్ తెనాలి జిల్లా వైద్యశాల పర్యటన శనివారంతో ముగిసింది. తల్లీపిల్లల వైద్యశాలలోని ఓపీ, ఎస్ఎన్‌సీయూ, క్యాజువాలిటీ విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులు డాక్టర్ పొన్ను రాజు, డాక్టర్ సునీత పలివాల్ మాట్లాడుతూ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలను పరిశీలించినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ ముస్కాన్ టీమ్ రెండు రోజులు తమ వైద్యశాలలో పర్యటించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. నేషనల్ క్వాలిటీ కంట్రోల్ నార్మ్స్ ప్రకారం వైద్యశాల నిర్వహిస్తున్నారా లేదా అనేది పరిశీలించారని, చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవలు, డైట్ వంటి వాటిపై ఆరా తీశారని తెలిపారు. వారు ఇచ్చిన సూచనలను అమలు చేస్తూ మరింత మెరుగైన వైద్యాన్ని చిన్నారులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఇంటెల్



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పాఠశాల ప్రిన్సిపాల్ రాణి జయకుమార్

మేడికొండూరు: గుంటూరు రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 విభాగంలో ఇంటెల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బాక్సింగ్‌లో అండర్–14 విభాగంలో పాఠశాలకు చెందిన రోహిత్, బాస్కెట్‌బాల్ విభాగంలో సోహెల్ జిల్లా జట్టుకు స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కోనూరి రాణి జయకుమార్ శనివారం తెలిపారు. త్వరలో గుంటూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఆనంద్, శ్రీక్రాంత్, సంజయ్, యాసిన్, అజ్మల్, బాలికల విభాగంలో షేక్ ఆసియా, సుల్తానా, గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పాఠశాల పీఈటీ రస్‌హుస్సేన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాణి జయకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

విదేశీ విద్యాలయాల్లో ఉపకార వేతనాలు

కేఎల్‌యూ డీన్ కిషోర్ బాబు



విదేశీ విద్యా మేళాను ప్రారంభిస్తున్న కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీలలో ప్రత్యేక రాయితీలతో పాటు ఉపకార వేతనాలు కూడా అందిస్తున్నారని వర్సిటీ అంతర్జాతీయ పౌర సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిశోర్‌బాబు తెలిపారు. శనివారం విదేశీ విద్యా మేళా రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావుతో కలసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేఎల్‌యూకి అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉందని చెప్పారు. ఈ విశ్వ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశీ విశ్వ విద్యాలయాల్లో చేరాలనుకునే వారికి మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఫీజు రాయితీలతో పాటు ఉపకార వేతనాలు కూడా అందిస్తున్నామని వివరించారు. ఉన్నత విద్యకు వేసుకోవాల్సిన ప్రణాళిక, ఏ చదువుకు ఎలాంటి పరీక్షలు రాయాల్సి ఉంటుందనే అంశాలతో పాటు ఉత్తమ ర్యాంక్ ఉన్న యూనివర్సిటీలలో చేరాలంటే ఏ పరీక్షలో ఎన్ని మార్కులు సాధించాలనే విషయాలను ఆయా యూనివర్సిటీల ప్రతినిధులు తల్లిదండ్రులకు, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డైరెక్టర్ విజయ్ మారుతి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

తాడేపల్లిరూరల్: బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళాబిల్లు ప్రయోజనం పొందాలంటే బీసీల వాటా తేలాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. శనివారం మంగళగిరి పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్‌లో ఇండియన్ బ్యాంక్ వద్ద ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కుల జన గణన పూర్తి చేసి చట్టసభల్లో బీసీలకు వాటా వారికి ఇవ్వాలని అప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, మహిళా అధ్యక్షురాలు కాండ్రు కమల, కోశాధికారి కన్నా మాస్టారు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్ : బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. పట్టణ ఇస్లాంపేట కట్టా వారి వీధికి చెందిన 14 ఏళ్ల బాలిక తొమ్మిదో తరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఉంటోంది. చిరు వ్యాపారి అయిన ఆమె తల్లి శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నానికి తిరిగి వచ్చేసరికి బాలిక కనబడకుండా పోయింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి రామారావు



పాదయాత్రలో ప్రజా సమస్యలు వింటున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాసి, కార్మికుల పొట్టకొడుతున్న ప్రభుత్వాలను వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాచైతన్య పాదయాత్ర శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లాగా మార్చి, అన్ని రంగాల కార్మికులను ఇబ్బందుల పాలు చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి అనేకసార్లు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసిందని, నిత్యావసరాలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డేశ్వరంలో భూ పోరాట కేంద్రంలో అసైన్డ్ భూముల్లో నివసిస్తున్న పేదలు తమకు నివసించే చోట ఇళ్ల స్థలాలు రెగ్యులర్ చేసి పట్టాలు ఇవ్వాలని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.అజయ్ కుమార్, ఎం.సూర్యారావు, ఎస్.బాలాజీ, జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లెకృష్ణ, సంసోను, వడ్డేశ్వరం పున్నయ్య పాల్గొన్నారు.

ఆశ వర్కర్ కుటుంబానికి అండగా ప్రభుత్వం



కృపమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఆశ వర్కర్ రేపూడి కృపమ్మ కుటుంబాన్ని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పరామర్శించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ఆశ వర్కర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. నిడమర్రులో కూడా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆశ వర్కర్లు వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇక్కడి రానప్పటికీ కృపమ్మ మృతికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారని చెప్పారు. రాష్ట్రంలో ఆశ వర్కర్ల సేవలు అమోఘమని, వాటిని ప్రభుత్వం గుర్తించేలా శాసన మండలిలోను, అసెంబ్లీలోను తప్పని సరిగా చర్చించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి వారి సమస్యలను పరిష్కారమయ్యేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేయాలని ఆశ వర్కర్లు ఎమ్మెల్సీని కోరగా స్పందించిన ఆయన తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డితో రూ.25 వేలు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి, ఆర్ఐ వంశీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఎస్టీ సెల్ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, ఐద్వా రాష్ట్ర నాయకులు శ్రీనివాస కుమారి, సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్–14 బాలబాలికల జిల్లా రగ్బీ ప్రాబబుల్స్ ఎంపిక



రగ్బీ ఆడుతున్న క్రీడాకారులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తెనాలి బైపాస్ రోడ్ వద్ద గల బాపూజీ విద్యాలయం మైదానంలో రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్ జూనియర్ చాంపియన్ షిప్ జట్ల ఎంపిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ చైర్మన్ తులసీరామ్ మాట్లాడుతూ జిల్లాలోని వినుకొండ, పేరేచర్ల, నిడమర్రు, చినకాకాని తదితర ప్రాంతాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొనగా 30 మంది బాలురను, 30 మంది బాలికలను ఎంపిక చేశామని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ చాంపియన్ షిప్ పోటీలలో వీరు తమ ప్రతిభను ప్రదర్శిస్తారని అన్నారు. గుంటూరు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ అధ్యక్షురాలు వై. సుజాత, పాఠశాల హెచ్ఎం శివచంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్న కాకాని భాస్కరరావు, నిడమర్రు రవి, తక్కెలపాడు డానియేల్, జ్యోస్న రమాదేవి, బాలాజీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అండర్–19 జట్టుకు ఎంపికైన కొర్రపాడు విద్యార్థి



ఎంపికైన విద్యార్థులతో కొర్రపాడు పాఠశాల ఉపాధ్యాయులు

మేడికొండూరు: మండలంలోని కొర్రపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంపాల రమేష్‌కుమార్ శనివారం తెలిపారు.కృష్ణా జిల్లా నందిగామలో గతనెల 27వ తేదీన నిర్వహించిన అండర్–19 స్కూల్ గేమ్స్ ఎంపికల్లో పాఠశాలకు చెందిన తొమ్మిది విద్యార్థులు ఎంపికై నట్లు చెప్పారు. ఈనెల 8 నుంచి చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే అండర్–19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, పీఈటీ షేక్ కరీముల్లా అభినందించారు.

చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయంతో టిఫిన్ బండ్లను శనివారం అందజేశారు. తాడేపల్లి రైతు విభాగం కన్వీనర్ బందాపు రుక్మాంగరెడ్డి అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు దార్ల హేమ పద్మజ, దొంతిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ప్రమీల రాణి, భూపతి శివసత్య కిశోర్ పాల్గొన్నారు.

ఆంధ్ర క్రైస్తవ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు సత్కారం

నగరంపాలెం: ఆగస్టులో జరిగిన ఆర్మీ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ పరీక్ష ఫలితాల్లో ఆంధ్ర క్రైస్తవ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పి.రాజు (సీఐఎస్ఎఫ్), కె.సాయిబాబు (బీఎస్ఎఫ్), యు.వి.వసంత్ కుమార్ (ఆర్మీ) ఉద్యోగాలు సాధించారు. కళాశాల ఆవరణలో వీరిని శనివారం కరస్పాండెంట్ రెవరెండ్ డాక్టర్ కె.ఎఫ్.పరదేశిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.విజయకుమార్, డాక్టర్ కె.జోసఫ్, డాక్టర్ జి.ప్రీతం ప్రకాష్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.ఎం.వినయ్‌తేజ్, ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ కె.రవి, కేర్ టేకర్ ఎల్.సాగర్, కార్యాలయపు మేనేజర్ డి.వెంగయ్య సత్కరించి, అభినందించారు.